# దైవాధీనం

రచన :
★ శ్రీమతి దీదువాను బదరీనారాయణమ్మ

భారసాలనాటి పేరెవరికీ తెలియదు. కాని అందరూ అతనిని దైవాధీనంగారూ, అని పిలుస్తూవుండేవారు. పేరుకుతగ్గ భావం, భావానికితగ్గ మూర్తి, మూర్తికితగ్గ నడత, నడతకుతగ్గ మాట. వృత్తి అక్షయపాత్ర, ఎటులనో కష్టపడి నక్షత్రాలను లెఖ్ఖించడము, నాడి పరిశీలనచేయడంమటుకు నేర్చుకున్నాడు. ఎవరు ఏ ప్రశ్నవేశినా (దైవాధీనం) అంటూవుండేవాడు. నాబోటిది ఎవరైనా, ఏమండీ దైవాధీనంగారూ, అమ్మాయి ప్రసవించింది, మూలనక్షత్రాన మొగపిల్లవానినికన్నది, ఏంచేయమన్నారు ? అని అడిగితే మూడువేళ్ళు లెఖపెట్టి, మూలనక్షత్రం ముసలమ్మగండం, మూడుమానికెల మినుములు మాబోటివారికి దానంచేయండి, ఆ తరువాత దైవాధీనం అంటూవుండేవాడు. మా అమ్మాయి పుబ్బనక్షత్రాన ప్రథమరజస్వల ఐనది ఏం చేయమన్నారు అడిగితే, పుబ్బనక్షత్రం పూర్వసువాసినీ త్వదోషం, పదలంబెల్లం మాబోటివారికి దానంచేయండి ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. చంటిపిల్లకు శ్లేష్మంగావుంది. చేతినాడిచూచి చెప్పండి అంటే, చేతులో చాలా వాతంగావున్నది, కలకండపాకంతో కరక్కాయి అరగతీసి యివ్వండి, ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. నూరేళ్ళముసలివాళ్ళు వచ్చి తెల్లవారుజామున దగ్గు ప్రకోపించిందండి. చెయ్యిచూచిచెప్పమంటే, చెయ్యిచూచి, నాడి మూడోవేలిమీద కొడుతోంది, నీరసస్తితిలోవున్నది. పుష్టిచేయడానికి పెసరగింజంత నల్లమందు గొంతుకలో ప్రయోగంచేయండి ఆ తరువాత (దైవాధీనం) అనేవాడు. యీ అమాయకపు మాట అందరి గుండెలనూ అలజడి చేస్తూవుండేది. యింటో ఆవిడ, ఏలాగండీ సంసారం యీదడం, యీ పదిమంది పిల్లలనూ ఏలాగా పెంచడం, వీధులోకివెడితే విస్తరాకైనా తీసుకురాలేరు. మీతమ్ముడు చూడారా రాజదర్బారులోనికేగి, రోజూ కుంచెడు బియ్యం ముంతెడునెయ్యి, కూరా, నారా తెచ్చుకుని జలాసాగా కాలక్షేపం చేస్తూవుంటాడు. మీరుకూడా తెచ్చుకొనరాదా అని అంటే, అంతా దైవాధీనం, ప్రాప్తకాలముంటే, దానంతట వచ్చి పడుతుంది అంటాడు. యీ అమాయికపుమాటే యితనికి పేరమనెంటు పేరైంది. ఫదుగురాడుమాట, పాటయైధరచెల్లు అన్నట్లు ధృవమైనది. వాస్తవంగా, తనజీవితం, తన భార్యా బిడ్డలజీవితం, దైవాధీనంమీదనే నిర్వహిస్తూ వుండేవాడు.

అన్న, దమ్ములద్వేషం అనాదిసిద్ధమైయుంది. స్తుతిపొగడ్తలకువశమై రాజుకు అతను గుండెకాయలా ప్రవర్తిస్తూవుండేవాడు. రాజదర్బారులో అతనికి పలుకుబడి ఎక్కువ. ఎవరు ఏప్రశ్నవేశినా (రాజాధీనం) అంటూవుండేవాడు. ఎప్పుడు యాచనకువచ్చినా రాజాధీనం జగత్సర్వం అంటూవుండేవాడు. ఒకనాడు పట్టరాని సంతోషమువచ్చి ఒక పెద్ద గుమ్మిడికాయ ప్రభువు రాజాధీనంగారికి దానంచేశాడు. లేక లేక కలిగిన పుత్రసంతానఫలప్రాప్తిచే, రాజాధీనంగారిని దగ్గరగాపిలిచి, యిది మీరూ మీభార్యామాత్రమే ఉపయోగించుకోవాలి. మిగిలిన రుచి ఏలా ఉన్నదీ మీరు నాకు చెప్పాలన్నాడు రాజుగారు. గూఢభావము ఎరుగనిమూఢుడు ఆ గుమ్మిడిపండును నెత్తినపెట్టుకుని కాలుసాగించాడు. కొంతదూరం వెళ్ళుసరికి నెత్తిబరువెక్కి మోయలేక కోమటికొట్టువద్ద దింపి యీలా అన్నాడు. ఏమోయీకోమటి యీ గుమ్మిడిపండు నీవు తీసుకొని ఎత్తెడు బెల్లమియ్యి. ఆలుమగలము మేమిద్దరమే. నీవు పదిమంది బిడ్డలుకలవాడవు. అని బెల్లంతీసుకొని బయలుదేరినాడు. అమ్మయ్యా పీడ వదలింది. అంత గుమ్మిడికాయకూర మేమేలా తినగలం. రాజుకు వివేకంలేదు. మమ్మలినే తినమని రుచిచెప్పమన్నాడు. యీ ఎత్తెడు బెల్లం, పుటకేడుబూరెలు అవుతాయి. హాయిగా వారంరోజులు తినవచ్చు అని సంతోషిస్తూ యింటికివెళ్ళినాడు.

మరునాడు దైవాధీనంగారు మామూలుచొప్పున దర్బారుకు వెళ్ళినాడు. రాజుగారు ఉన్నట్లువుండి పుత్రుని జాతకం ఫలితాలు చెప్పమన్నాడు. (జ్యేష్టమాసం, జ్యేష్టనక్షత్రం, జ్యేష్టుడు) త్రిజ్యేష్టలు తండ్రి గండమండి. ముంతెడునూనె- ముద్దచిమ్మిలీ మాబోటివాండ్లకు దానంచేయండి అన్నాడు. అని వూరుకున్నాడా, అందరి దగ్గర అన్న అలవాటు చొప్పున (ఆ తరువాత దైవా

ధీనం) అని చటుకున అనేశాడు. అవివేకపురాజు ఆ అపశకునపుమాటకు, అక్కసునపడి, అతనిని దేవిడే మన్నా చేయించాడు. పాపం (దైవాధీనంగారు ఏం చేస్తారు) వాలుమొగంతో దైవవిధిని తలుచుకుంటూ యింటికి వస్తున్నాడు. దారిలో కోమటి దైవాధీనంగారి దీనభావాన్ని విమర్శించాడు. అతడు యీలా అన్నాడు ఎందుకండి దైవాధీనంగారూ, యీలా విచారిస్తారూ. యీవేళ మా తండ్రిగారి ఆబ్దీకము. మీబోటి మహానీయులు మాకు దొరకడం కష్టం. అని పీటవేసి కూర్చోపెట్టి, పళ్ళెముడు బియ్యం, గుమ్మిడిపండు, పప్పూ, ఉప్పూ, సామానుతో. పితృకార్యాన్ని నిర్వహించాడు. అల్ప సంతోషియైన ఆ విప్రుడు హాయిగా సంతోషిస్తూ, ఆవిడదగ్గరకువెళ్ళి అష్టేవతికిలబడ్డాడు. యిదిగో చూడూ యీవేళ యిది మన ప్రాప్తకాలం. కోమటి పిలిచి పీట వేశి కడుభక్తితో దానంచేశాడు. లేకపోతే యీవేళ కడుపులో ఎలుకలు గెంతులు వేయవలసినదే. కమ్మగా కూరవండి కడుపునిండా అన్నం పెట్టమన్నాడు. గంపెడు సంతోషంతో కత్తిపీట ముందువేసుకొని గుమ్మిడికాయను ప్రయోగించింది. గలగలమన్నది ఏమిటో, గడుసుబుర్ర కనుకగంపమూతపెట్టి. గబగబా బయటికివచ్చి, ఏమండోయి. ఏమండోయి, యీలారండీ. యీలారండీ అన్నది. దైవాధీనంగారు ఏదో గలిభీవచ్చిందని కడుపు తడుముకొంటూ లోపలికి వెళ్ళినాడు. తలుపులు మూతలుబడ్డాయి.

యింట్లో గుసగుసలు. ప్రాప్తకాలమంటే యిదేనే, పడి దిగకపోయినా పాదాలమీద వాలుతుంది. యిదంతా దైవాధీనం అన్నాడు పూరిల్లు, పెంకుటిల్లైంది. పేద ముత్తైదుబంగారు బొమ్మైంది. ప్రభువుగారి దేవిడీలో ప్రజ్ఞలను పొగడడానికి వెళ్ళిన రాజాధీనంగారిని రాజ ప్రాంగణాలకు రానీలులేదన్నారు. ఊరుకున్నవాడు వూరుకోక ప్రభువువారి ప్రాపకం యింకా సంపాదించాలని, అయ్యా, ఆ గుమ్మిడికాయరుచి ఏమనిచెప్పనూ, ఏదేశం నుండి తెప్పించారో కానీ యీసంతైనా బెల్లం వెయ్యనక్కరలేకపోయిందన్నాడు. ఔరా ఎంత చిత్రం, ఎవరిది ఎవరికి ప్రాప్తమో అని ఆశ్చర్యపడి, అంతా దైవాధీనంకదా అనుకున్నాడు. దైవాధీనంగారికి అగ్రస్థానమిచ్చాడు. కోమటి హృదయం గుజగుజలాడింది. అతని అమాయకపుమాటే ఆదర్శప్రాయమయింది.. మానవ జీవితాలు, దైవాధీనాలు, ప్రయత్నాలు నిమిత్తమాత్రాలు. కథకంచికి వెడితే మనమింటికి వచ్చాము.

---

# రూలంటే రూలే!

"లీల"

నెపోలియన్ పేరు వినని వారుండరు. అతను ఒక రోజు ఆల్ప్స పర్వతాలలో తన సైన్యంతో మజిలీవేశ్లాడు. ఆయన కొన్ని కఠినమైన నిబంధనలను చేశాడు. రాత్రి పదిదాటిన తరువాత సైనికులందరు దీపాలార్పివేసి పడుకోవాలి. ఎవరు మేలుకోగూడదు. ఒకవేళ ఎవరైనామేలుకొన్నా మర్నాడు అతను కఠినశిక్షకు పాత్రుడవలసిందే నెపోలియన్ ప్రతిరోజూ పదిదాటిన తరువాత సైన్య శిబిరాలన్నీ తిరిగేవాడు అతను నిద్రపోయేది బహు స్వల్ప కాలము.

జాన్ ఒక సైనికుడు, అతని స్వదేశం అరేబియా. మూడేళ్ళకిందట సైన్యంలో ప్రవేశించాడు. అతనికి ఒక ముసలి తల్లి తప్ప నాఅనేవారెవరూలేరు. మూడేళ్ళనుండి ఆమెకు ఒక ఉత్తరం వ్రాశేదానికి కూడ వీలుపడలేదు జాన్ ఆరోజు ఎలాగైనా సరే ఆమెకు ఒక ఉత్తరం వ్రాయాలను కొన్నాడు పగలంతా పనిలోనే గడచిపోయింది.

రాత్రి పదవుతుంది. జాన్ ఒక పెద్ద ఫిరంగిచాటున కూర్చొని, ఒక కిరసనాయిలుబుడ్డి వెలుగులో తల్లికి గబగబ ఉత్తరం వ్రాయసాగాడు. నెపోలియన్ దీపాన్ని చూచి గబగబ వచ్చాడు. జాన్ గడగడ వణికిపోయాడు. "ఏం చేస్తున్నావ్" గర్జించాడు నెపోలియన్. "మా అమ్మకు రెండేళ్ళనుండి ఉత్తరం వ్రాయలేదండి. ఇప్పుడు వ్రాస్తున్నాను" భయపడుతూ చెప్పాడు జాన్.

"రూలు నతిక్రమించావని తెలుసా! "చిత్తం"

"సరే! ఇదే ఆఖరు ఉత్తరం అనివ్రాసి ఉత్తరాన్ని పూర్తిచేయ్!"

జాన్ ఆ విధంగానే పూర్తిచేశాడు.

మర్నాడు జాన్‌ను ఒక స్థంభానికి కట్టివేశాడు. "షూట్!" అన్నాడు నెపోలియన్. అంతే! మరో నిముషంలో తుపాకిగుండ్లు జాన్ హృదయాన్ని చీల్చుకొని వెళ్ళాయ్!